# రైతాంగాన్ని, వినియోగదారులను, కార్మికులను దోచుకొంటున్న చక్కెర మిల్లుల యాజమాన్యం

**విదేశాలలో** చెరకు ఉత్పత్తి బాగా పెరిగిందని, అంతర్జాతీయ మార్కెట్‌లో చక్కెర ధర పడిపోయిందని, దేశంలో, రాష్ట్రంలో చక్కెర నిల్వలు పేరుకుపోయాయని, క్వింటాల్ చక్కెరను 1900 రూ.లకు ఫ్యాక్టరీలు విక్రయిస్తు న్నాయని, ఎగుమతులు జరగటంలేదని, ఫలితంగా ఫ్యాక్టరీలు నష్టాల్లో వున్నాయని, చెరకు ధర టన్నుకు 1500 రూ. మించి ఇవ్వలేమని ఫ్యాక్టరీ యజమానులు గత సంవత్సరం చెప్పిన మాటలు ఇంకా రైతాంగం మరువలేదు. ఫ్యాక్టరీ యజమానులు చెప్పే మాటలు బూటకమని తెలిసినా, వారి ప్రయోజనాలే ముఖ్యమని భావించే పాలకులు, మద్దతు ధరను కూడా వారి ప్రయోజనాలకు అనుగుణంగానే ప్రకటించారు.

'నిల్వలు అపారంగా వున్నాయి, ధర పడిపోయింద'ని ఫ్యాక్టరీ యజమానులు చెప్పిన ఐదు నెలలకే, రాష్ట్రంలో పంచదార కొరత తీవ్రంకానున్నదని, పేదలకు రేషన్ కార్డులపై చక్కెర ఇచ్చే పరిస్థితి లేదనే ప్రచారం వెలుగులోకి వచ్చింది. ఆరునెలల క్రితం ఫ్యాక్టరీలు క్వింటాల్ చక్కెరను 1900 రూ.లకే విక్రయించగా, ఇప్పుడు 3800 రూ.లకు ఎలా పెరిగింది? బహిరంగ మార్కెట్‌లో కిలో 32 నుండి 48 రూపాయలకు ఎలా చేరుకొంది? చక్కెర ధరలు పెరిగినా, చెరకు మద్దతు ధర ఎందుకు పెరగలేదు?

దేశంలోని చాలా రాష్ట్రాల్లో కాంట్రాక్టు (ఒప్పందం) చెరకు సాగు విధానం భారీగా సాగుతున్నది. ఇది రైతాంగానికి నష్టాలనే మిగుల్చుతున్నది. గత ఎనిమిది సంవత్సరాలుగా చెరకు సేద్యంలో అటూ, ఇటూ కొద్ది తేడాతో చెరకు సేద్యం, మద్దతుధర ఉంది. అందుకు ఈ క్రింది గణాంకాలే అద్దం పడుతున్నాయి.

**2009-10 నుండి 2016-17 వరకు దేశంలో చెరకు సాగు**

| సంవత్సరం | చెరకుసాగు (ల.హెక్టార్లు) | క్వింటాల్ మద్దతుధర (రూపాయల్లో) |
|---|---|---|
| 2009-10 | 41.75 | 135 |
| 2010-11 | 48.85 | 139 |
| 2011-12 | 51.00 | 145 |
| 2012-13 | 52.79 | 170 |
| 2013-14 | 53.41 | 210 |
| 2014-15 | 53.07 | 220 |
| 2015-16 | 52.89 | 230 |
| 2016-17 | 49.91 | 230 |

ఆధారం : 20-2-2017 ఈనాడు

నుండి 2014-15 సం॥మధ్యలో ఒక లక్ష హెక్టార్లలో మాత్రమే చెరకు సేద్యం పెరిగి 2015-16, 2016-17 సం॥మధ్యలో మూడు లక్షల హెక్టార్ల సేద్యం తగ్గింది.

ప్రారంభంలో చెరకు సాగుపై రైతాంగం ఎంతో మక్కువ చూపేవారు. చెరకు ధర ఆశాజనకంగా వుండటం, ప్రభుత్వ ధరపై ఫ్యాక్టరీలు అదనపు ధర ఇవ్వటం, చెరకు కొనుగోలుకు ఫ్యాక్టరీలు పోటీపడటం, రైతాంగానికి విత్తనం, ఎరువులు మొదలగువాటిని ఫ్యాక్టరీలే సరఫరా చేయటం, ఎటువంటి పూచీకత్తు లేకుండా రుణాలు ఇవ్వటం, చెరకు నరుకుడు, రవాణా ఖర్చులను ఫ్యాక్టరీలే భరించటంవలన రైతాంగం ఎంతో కొంత ఊరట పొంది సేద్యం ఎడల మక్కువ చూపారు. చెరకు సేద్యం ఎడల రైతాంగం మక్కువచూపి, విస్తీర్ణం పెంచటంతో క్రమంగా రైతాంగానికి యిచ్చే రాయితీలన్నీ ఎత్తివేశారు. ఫలితంగా సేద్యం రైతాంగానికి భారంగా మారటం, న్యాయమైన ధర లభించక పోవటంతో చెరకు సేద్యం ఎడల రైతుల్లో ఏర్పడిన విముఖతే సేద్యపు విస్తీర్ణం తగ్గటానికి కారణమైంది.

నేడు చెరకు సేద్యం కంపెనీల కాంట్రాక్టు సాగులోకి మళ్ళింది. అనేక రాష్ట్రాల్లో ఇది అమలు జరుగుతున్నది. కాంట్రాక్టు ఒప్పందాన్ని కంపెనీలు ఎప్పుడూ అమలు జరపలేదు. ముందు ఒప్పందం చేసుకోవటం, పంట చేతికి వచ్చిన తర్వాత మార్కెట్‌లో ధర తగ్గిందని ఒప్పందాన్ని ఉల్లంఘించి రైతాంగానికి తక్కువ ధర యిస్తున్నాయి. కాంట్రాక్టు సేద్యం రైతాంగానికి లాభసాటి అని ప్రచారం చేస్తున్న పాలకులు, కంపెనీ యజమానులు ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ఎటువంటి చర్యలూ తీసుకోకుండా వారికే అండగా నిలుస్తున్నారు. నిరుపయోగమైన మద్దతు ధరలను ప్రకటించి, రైతాంగాన్ని కాంట్రాక్టు సేద్యానికి కట్టిపడేయ చూస్తున్నారు. టన్ను చెరకు క్రషింగ్‌ద్వారా అన్ని ఖర్చులు పోనూ 1650 రూ. ఫ్యాక్టరీలకు మిగులుతుంటే, రైతాంగం పండించే టన్ను చెరకుకు 3,600 రూ. ఖర్చుపెడుతుంటే, ప్రభుత్వం 2,300 రూ. మించి మద్దతుధర ఇవ్వకపోవటం, రైతాంగం ఎంతగా దోపిడీకి గురౌతున్నదీ వెల్లడిస్తున్నది.

దేశవ్యాపితంగా 600 చెరకు ఫ్యాక్టరీలు వుండగా 2014-15లో 530 ఫ్యాక్టరీలు క్రషింగ్ ప్రారంభించి, తగినంత చెరకులేక 240 ఫ్యాక్టరీలు మధ్యలోనే క్రషింగ్‌ని ఆపివేశాయంటే చెరకు సేద్యం ఏవిధంగా సంక్షోభంలో వుందీ తెలుస్తుంది. దీనితో మరోవైపున ఈ ఫ్యాక్టరీలలో పనిచేసే వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు.

తమ పార్టీ అధికారంలోకి వస్తే సహకార రంగంలోని చక్కెర మిల్లులను నష్టాల ఊబినుండి బయటకిలాగి లాభాలబాట పట్టిస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీయిచ్చాడు. అధికారంలోకి వచ్చిన తరువాత అందుకు విరుద్ధంగా వ్యవహరించాడు. ప్రైవేట్ మిల్లులకు లాభాలు వస్తుంటే, సహకారరంగంలోని ఫ్యాక్టరీలు ఎందుకు నష్టాలు పొందుతున్నాయనేది ఆలోచించి, అందుకు తగిన చర్యలు తీసుకోకుండా, నష్టాల జపాన్ని జపిస్తూ, వాటిని అమ్మకానికి పెట్టి, తన అనుయాయులకు చౌకగా కట్టబెట్టేందుకు సిద్ధమైనాడు. కడప, చిత్తూరు, కొవ్వూరు ఫ్యాక్టరీలు ఆ జాబితాలో చేరాయి. సహకారరంగంలో నష్టాలు వస్తున్నాయని చెప్పే చంద్రబాబుకు, ఏటికొప్పాక సహకార చక్కెర ఫ్యాక్టరీ లాభాలు గడిస్తున్న విషయం తెలియదా?! సమర్థవంతంగా నడిపే యంత్రాంగం వుంటే సహకార ఫ్యాక్టరీలు నష్టపోవని, లాభాల బాటలో పయనిస్తాయని ఏటికొప్పాక ఫ్యాక్టరీ నిరూపించింది. ప్రభుత్వరంగాన్ని ఎత్తివేయటమే చంద్రబాబు విధానం కాబట్టి అలాంటి యంత్రాంగాన్ని నియమించటంలేదు.

దేశవ్యాపితంగా వార్షిక చక్కెర వినియోగం 270 లక్షల టన్నులు. దేశ ప్రజలందరూ చక్కెర వినియోగించ గలిగితే ఈ పరిణామం చాలా ఎక్కువగా వుంటుంది. 2013-14లో చక్కెర ఉత్పత్తి 245 లక్షల టన్నులు. కాగా, 2014-15లో 279 లక్షల టన్నులు ఉత్పత్తి జరిగినట్లు, ఇది దేశంలో రికార్డు స్థాయి ఉత్పత్తిగా భారత చక్కెర మిల్లుల సంఘం(ఇస్మా) తెలిపింది. దేశ వినియోగంకన్నా తొమ్మిది లక్షల టన్నులు ఎక్కువ. 2014 నాటికి దేశంలో 65 లక్షల టన్నుల పంచదార నిల్వలు వున్నాయి. 2015-16 సంవత్సరం నాటికి 74 లక్షల టన్నుల పంచదార నిల్వలు దేశంలో వున్నాయి. ఈ నిల్వలు చూపెట్టి, ధరలు తగ్గాయనే పేరుతో చెరకు ధరను పెంచటానికి ఫ్యాక్టరీలు నిరాకరించాయి. ఇప్పుడు పంచదారకు కొరత ఏర్పడిందనే పేరుతో టోకు, చిల్లర ధరలను విపరీతంగా పెంచాయి. చక్కెర కొరత అన్నది కూడా బడా ఫ్యాక్టరీ యజమానుల సృష్టే. 2016-17 సం॥ నవంబర్ నుండి కొత్త చెరకు క్రషింగ్ ప్రారంభమై మార్చిదాకా సాగింది. ఈ సంవత్సరం 2.13 కోట్ల టన్నులకు పైగా చక్కెర ఉత్పత్తి అవుతుందని, పాత నిల్వలతో కలిపి 2.90 కోట్ల టన్నులు దేశ అవసరాలకు వుందని భారత చక్కెర మిల్లుల సంఘం(ఇస్మా) పేర్కొంది. ఈ సంవత్సరం నవంబరు నుండి తిరిగి మిల్లులు క్రషింగ్ ప్రారంభించటం ద్వారా చక్కెర ఉత్పత్తి జరుగుతుంది. ఇది కాకుండా అధిక ధరపెట్టి విదేశాల నుండి చక్కెర దిగుమతి చేసుకొంటూను వున్నాము. అలాంటప్పుడు చక్కెర కొరతకు ఆస్కారం లేదు. రేటు పెంచటానికి ఫ్యాక్టరీలు చేసిన ప్రచారమే కానీ, వాస్తవం అందుకు విరుద్ధం.

రైతాంగానికి కనీస న్యాయమైన ధర ఇవ్వటానికి కూడా నిరాకరించిన మిల్లు యాజమాన్యాలు, రైతుల డబ్బుతోనే ఫ్యాక్టరీలు నడుపుతున్నారన్న వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. చెరకు విక్రయించిన రైతాంగానికి సంవత్సరాల తరబడి డబ్బులు ఇవ్వకుండా వేలాది కోట్ల రూపాయలు తమవద్దే వుంచుకొని వ్యాపారం చేస్తున్నారు. ఇప్పటికే దేశవ్యాపితంగా రైతాంగానికి చెల్లించాల్సిన బకాయిలు 22,300 కోట్లు వున్నాయంటే మిల్లు యజమానులు రైతాంగాన్ని ఏ విధంగా దోచుకొంటున్నారో వెల్లడౌతుంది. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా రైతులకు, మిల్లు యాజమాన్యాలు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోయాయి. రాష్ట్రంలోని సహకార మిల్లులు చెల్లించాల్సిన 230 కోట్ల బకాయిలను చెల్లిస్తామని చెప్పిన చంద్రబాబు రెండేళ్ళు గడిచినా పూర్తిగా చెల్లించలేదు.

రైతుల డబ్బుతో ఫ్యాక్టరీలు నడుపుతున్న బడా పారిశ్రామికవేత్తలు నష్టాల పేరుతో బ్యాంక్ అప్పులు కూడా చెల్లించటంలేదు. గత ఆరు సంవత్సరాల కాలంలో 11 వేలకోట్ల నుండి 33 వేల కోట్లకు వీరు బ్యాంకులకు బకాయి పడ్డారు. అప్పులు చెల్లించకుండానే, రైతులకు బకాయిలు చెల్లించే పేరుతో తిరిగి బ్యాంక్‌ల నుండి రుణాలు ఇప్పించాలని ప్రభుత్వంపై మిల్లు యజమానులు వత్తిడి చేయటంతో 7,500 కోట్లను వడ్డీలేకుండా ప్రభుత్వం హామీవుండి అందించటం, ప్రభుత్వం ఎవరి ప్రయోజనాలు కాపాడుతుందనటానికి ఇది నిదర్శనంగా వుంది.

చక్కెర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి నివేదిక సమర్పించేందుకు రంగరాజన్ కమీషన్‌ను ప్రభుత్వం నియమించింది. కమీషన్ బడా పెట్టుబడిదారులకు, మిల్లు యజమానులకు అనుకూలంగా అనేక సిఫార్సులు చేసింది. లెవీ విధానాన్ని రద్దుచేసి బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలు జరగాలని సూచించింది. మిల్లు యజమానులు కోరుకున్నది అదే కాబట్టి, కమీషన్ సూచనలకు వారు ఆమోదం తెలపటం, ప్రభుత్వం నివేదికను ఆమోదించటం జరిగిపోయింది. అందువలన చక్కెర ధర నిర్ణయం ఫ్యాక్టరీల చేతుల్లోకి వెళ్ళింది.

ఇంతకుముందు మిల్లులు ఉత్పత్తిచేసే చక్కెరలో 10 శాతాన్ని లెవీ క్రింద ప్రభుత్వానికి తప్పనిసరిగా ఇవ్వాలి. దానికి మద్దతుధర ప్రకారం ప్రభుత్వం మిల్లులకు చెల్లించేది. మిగతా చక్కెరను బహిరంగ మార్కెట్‌లో యజమానులు అమ్ముకొనేవారు. లెవీ క్రింద తీసుకొన్న పంచదార చౌక డిపోల ద్వారా పేదలకు పంపిణీ జరిగేది. సబ్సిడీ రూపంలో పేదలకు పంచదార ఇవ్వాలంటే రాష్ట్రప్రభుత్వాలు ఇకనుండి బహిరంగ మార్కెట్‌లో కొనాల్సిందే. అందుకు లెవీ విధానం రద్దు కావటమే కారణం. పేదలకోసం కొనుగోలుచేసే చక్కెరపై రాష్ట్రప్రభుత్వాలకు, కేంద్రం కొంతకాలం సబ్సిడీ ఇస్తానని ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పేదలకు చక్కెర ఇచ్చేదానికోసం కేంద్రం 4,500 కోట్లు కేటాయించి, వచ్చే సంవత్సరం నుండి ఇక రాయితీ వుండదని ప్రకటించింది. సబ్సిడీలు తగ్గించుకోవటానికి అనేక రకాలుగా ప్రయత్నిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లాంటి ప్రభుత్వాలు అధిక ధరపెట్టి కొని, పేదలకు చక్కెర పంపిణీ చేస్తాయనేది సందేహమే. ధర పెరిగిన చక్కెరను కొనుగోలు చేయటం భారంగా మారి దాని వినియోగాన్ని పేదలు విరమించు కోవాల్సి వస్తుంది.

చక్కెర ధరలు తగ్గాయని రైతులకు న్యాయమైన ధరలు ఇవ్వకుండా రైతులను, చక్కెర కొరత ఏర్పడిందనే పేరుతో ధరను పెంచి వినియోగదారులను మరోవైపున ఆయా ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులను - దోచు కోవటం బడాచక్కెర మిల్లు యజమానుల విధానంగా మారింది. ఈ విధంగా రైతాంగం, కార్మికులు, వినియోగ దారులు వీరి దోపిడీకి గురౌతున్నారు. పాలకులు మిల్లు యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. రైతాంగం, వినియోగదారులు, కార్మికులు, బడా మిల్లు యజమానుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడినప్పుడే వీరందరి ప్రయోజనాలు నెరవేరతాయి.